క్లుప్తంగా

కాలువ నిర్మాణానికి భూమిపూజ



కాలువ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కనక సింహాచలం, తదితరులు

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో బీసీ కాలనీ, రెల్లివీధుల్లో కాలువ నిర్మాణాలకు డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరి ఆదివారం భూమిపూజ చేశారు. కాలువల పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాకోడులో ఉచిత మెగా వైద్యశిబిరం



చిన్నారులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరమణ

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడులో వెంకటపద్మ ఫౌండేషన్, సర్పంచ్ పాటి పిరెడ్డి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 123 మంది చిన్నారులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ జి.మహేష్, వెంకటపద్మ ఆస్పత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు కె.పైడమ్మ, జి.శాంతమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పి.మాధవి, జి.దేవి, బి.దేవి, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె ఫిర్యాదుతో తల్లిపై కేసు నమోదు

విజయనగరం క్రైమ్: త్వరగా పెరగాలన్న ఉద్దేశంతో కన్న కూతురిపై మెడిసిన్స్ ప్రయోగించిన తల్లిపై బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దిశా సీఐ నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఆ బాలిక ప్రస్తుతం విశాఖలోని బాలికల వసతి గృహంలో ఉంది. బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బాలికతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బాలిక భద్రతకు ప్రభుత్వపరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాలికపై ఆమె తల్లి ప్రయోగించిన మందులకు సంబంధించిన రిపోర్టు మరికొద్ది రోజుల్లో రానుందని చెప్పారు. వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లకు ఈ నెల 5, 6 తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలకు అవసరమయ్యే తాగునీటిని పంపిణీ చేసే ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం వద్ద విద్యుత్ తీగలు తెగిపోవడంతో తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 37, 38, 39, 40, 41, 43, 46, 47 డివిజన్ ప్రజలు సహకరించాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కొత్తవలస: నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఫర్ ది పీపుల్ ట్రస్టు సభ్యులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన ఫర్ ది పీపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 37 మంది నిరుపేద, ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కదారి రాజు, విశ్రాంత రైల్వే ఉద్యోగి రమణ సహకారంతో సరుకులు పంపిణీ చేసినట్లు ట్రస్టు చైర్మన్ విశ్వనాథం హరికుమార్ తెలిపారు. ట్రస్టు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో..

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వ ర్యంలో నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలో పేదలు, ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులు అందజేశామని సేవా సంస్థ సభ్యులు తెలిపారు.

ఉమా నీలకంఠేశ్వర స్వామి కల్యాణం

చీపురుపల్లి: పట్టణంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మ వారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- సచివాలయ వ్యవస్థతో అందుబాటులోకి అన్ని సేవలు
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 61 సచివాలయాల ఏర్పాటు
- సచివాలయాల ద్వారా 536 సేవలు



నగరంలోని కొత్తపేట కుమ్మరివీధిలో వార్డు సచివాలయం

ప్రాంతం: విజయనగరం కార్పొరేషన్

2011 జనాభా లెక్కల ప్రకారం

ఇళ్ల సంఖ్య:	61,927
సచివాలయాల సంఖ్య :	61
సచివాలయల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు:	537
సచివాలయాల్లో అందిస్తున సేవలు సంఖ్య:	536

విజయనగరం: నగరంలోని కానుకుర్తివారి వీధికి చెందిన గణేష్‌కు 2018 సంవత్సరంలో ఆడపిల్ల జన్మించింది. జనన ధ్రువీకరణ పత్రం కోసం కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్తే వివిధ కారణాలతో నెల రోజుల సమయం పట్టింది. చేసేదేమీ లేక అధికారులు జనన ధ్రువీకరణపత్రం జారీ చేసే వరకు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. 2019 ఎన్నికల అనంతరం పరిస్థితులు మారాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ వల్ల కేవలం రోజు వ్యవధిలోనే కావాల్సిన ధ్రువపత్రాలు సచివాలయ కార్యదర్శులు అందజేస్తున్నారు.

సత్ఫలితాలు

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటు చేసిన సచివాలయాల ద్వారా ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. 2019 అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలనూ క్షేత్ర స్థాయిలో అందిస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లు ఉండగా... 2011 జనాభా లెక్కల ప్రకారం నగర పరిధిలో 61,925 ఇళ్లకు గాపే 61 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలో 8 నుంచి 9 మంది కార్యదర్శులు వారికి కేటాయించిన విభాగాల్లో ప్రజలకు సేవలందిస్తున్నారు. ఈ సచివాలయాల ద్వారా 536 రకాల సేవలు అందించడం విశేషం.

మధ్యవర్తులు... అవినీతికి చెక్..

ఒకప్పుడు ప్రభుత్వ సేవలు పొందాలంటే సాధారణ పౌరులు ఎన్నో కష్టాలు పడేవారు. కొన్ని సేవలు పొందాలంటే మధ్యవర్తులను ఆశ్రయించి కొంత మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. సచివాలయ వ్యవస్థ రాకతో ఆటువంటి ఇబ్బందులకు చెక్ పడింది. సచివాలయాల్లో అందుతున్న సేవల పట్ల ప్రజలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన రెవెన్యూ సేవలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు, పన్నుల చెల్లింపులు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు క్షేత్ర స్థాయిలో కార్యదర్శులకు సహాయంగా నిలుస్తున్నారు.

ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తున్నారు..

గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే ఎమ్మార్వో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత సచివాలయాల పెట్టి మా కష్టాలు తీర్చారు. ఏ పని కావాల్సి వచ్చినా సచివాలయానికి వెళ్లి చేసుకుంటున్నాం. ప్రభుత్వం ఇచ్చే పథకాల కోసం వలంటీర్లు, సచివాలయ కార్యదర్శుల ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించుకుంటున్నారు.

– కె.సత్యవతి, గృహిణి, 14వ డివిజన్, విజయనగరం

సదుపాయాల కల్పనే ధ్యేయం..



ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. సచివాలయ వ్యవస్థ రాకతో అన్ని రకాల సేవలు ప్రజల చెంతకే అందుబాటులో వచ్చాయి. మొత్తం 538 రకాల సేవలు సచివాలయాల ద్వారా అందుతున్నాయి. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించినంత వరకు మధ్యలో ప్రభుత్వ పరంగా అందాల్సిన సేవలన్నీ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి.

– పీవీడీ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ. 24 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 38, 42 డివిజన్‌లలో పూర్తి చేసిన అభివృద్ధి పనులు ఆదివారం ప్రారంభించి, ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. 38వ డివిజన్‌లో రూ. 24 లక్షలతో చేపట్టిన రోడ్డుతో పాటు.. 42 డివిజన్‌లో రూ. 8.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్పొరేటర్లు తొగురోతు సంధ్యారాణి, పిన్నింటి కళావతి మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన తమ డివిజన్‌లలో కోలగట్ల కృషితో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు శివారు ప్రాంతాల అభివృద్ధిపైన ఆయన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. నగరం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న రోజుల్లో మరలా శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించే దిశగా రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సూర్యనారాయణ, నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు భాస్కరరావు

విజయనగరం అర్బన్: ఆర్థికంగా వెనుకబడిన రజక కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని విజయనగరం, పార్వతీపురం – మన్యం ఉమ్మడి జిల్లాల రజక సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక దాసన్నపేటలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ ఈ మేరకు తీర్మానించింది. రజకులకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కార మార్గం చూపాలని కమిటీ తీర్మానించింది. సంఘ అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా సెక్రటరీ జంప చిన్న, సలహాదారుడు గోవింద్, ఉపాధ్యక్షులు రాము, శ్రీను, తాతారావు, కోశాధికారి రాజారావు, రమణ, చిట్టిబాబు, వెలిగాపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకర్తకు స్వాగతం



వెంకటేశ్వరరెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: మరో గ్రంథాలయ ఉద్యమం కోసం ప్రముఖ రచయిత, ఉపాధ్యాయుడు , శాంతివనం నిర్వాహకుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా మరో గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు తన ద్విచక్రవాహనంపై రాయలసీమ నుంచి సుమారు నాలుగువేల కిలో మీటర్లు ప్రయాణించారు. ఉద్యమంలో భాగంగా విజయనగరంలో ఉన్న గురజాడ కేంద్ర గ్రంథాలయానికి ఆదివారం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో విజయనగర సాహితీ అభిలాషులు, గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త నాలుగెస్సుల రాజు మాట్లాడుతూ, నైతిక విలువలు పెంపొందించుకునేందుకు పుస్తక పఠనమే సాధనమన్నారు. గ్రంథాలయ ఉద్యమకర్త వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ, లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు ఎన్ని అవరోధాలు ఎదురైనా కష్టపడి సాధించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు లక్ష్మి, శ్రీనివాస్, అబ్దుల్ రవూఫ్, జిల్లా బాధ్యులు జీఎస్.చలం, ఆర్.బాలకృష్ణ, ఎస్‌కె.బాషా, గురజాడ ఇందిరాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గురుదేవ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం



కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న ఎంపీ జి.వి.ఎల్.నర్సింహరావు

కొత్తవలస: దేశంలోని నలుమూలల్లో ఉన్న దివ్యాంగులకు గురుదేవ చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయ కమని ఎంపీ జి.వి.ఎల్.నర్సింహరావు అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు ను ఆదివారం ఆయన సందర్శించారు. ట్రస్టు ఆవరణలో పేద, బడుగు బలహీన వర్గాలకు అత్యున్నత సేవలను ఉచితం గా అందజేస్తున్న సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని, వివిధ ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పేయేవారికి అమర్చే కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ట్రస్టు ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలను చైర్మన్ రావర్తి జగదీష్ బాబు ఆయనకు వివరించారు. అనంతరం ఎంపీ నర్సింహరావు మాట్లాడుతూ దివ్యాంగులకు ట్రస్టు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమైనవని, ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబును అభినందించారు. గడిచిన 25 ఏళ్లలో 1.89 లక్షల మందికి ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, పోలియో కాలిపర్స్, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు అందించడం సామాన్య విషయం కాదన్నారు. ట్రస్టు సేవలను ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించేందుకు తన వంతు సహాయం అందజేస్తామన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు,చేతులు,వినికిడి యంత్రాలను అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు రవికుమార్, ట్రస్టు వైస్ చైర్మన్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



వేంకటేశ్వరస్వామి వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

జామి: మండలంలోని భీమసింగి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం(చక్రస్నానం) వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వేదపండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పుష్పయాగం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



పుష్పయాగం చేస్తున్న అర్చకులు

రైలు ప్రమాద బాధితుల కోసం కంట్రోల్ రూమ్

బొండపల్లి: ఒడిసాలోని జరిగిన రైలు ప్రమాదంలో ఇంకా వివరాలు తెలియని వారి కోసం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ డి.ఎస్.జి.ఎస్. ప్రసాదరావు తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో కూడా వీఆర్‌ఓలను అప్రమత్తం చేశామని చెప్పారు. ఇంకా క్షతగాత్రులు ఎవ రెనా ఉన్నారా అని గ్రామాల్లో అప్రమత్తంగా ఉండి వారి వివరాలు తెలిస్తే వెంటనే తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశామని స్పష్టం చేశారు.

ఎంపీడీఓ వేదవతికి బదిలీ

బొండపల్లి: స్థానిక ఎంపీడీఓగా పని చేసిన ఏ.వేదవతికి బదిలీ అయింది. ఆమె జిల్లా పరిషత్ కార్యాలయానికి సూపరింటెండెంట్‌గా వెళ్లనున్నారు. ఇక్కడికి డెంకాడ మండలం ఎంపీడీఓగా పనిచేస్తున్న రాజ్‌కుమార్ రానున్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకటరమణ పదోన్నతిపైకు ఏఓగా ఇక్కడే విధులు నిర్వర్తించనున్నారు.

నేడు ' స్పందన '

దత్తిరాజేరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమ వారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు, ఫిర్యాదులు అందించవచ్చని సూచించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.

చురుగ్గా వైఎస్సార్ బీమా రెన్యువల్

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 17 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ బీమా రెన్యువల్‌కు సంబంధించిన బయోమెట్రిక్ నమోదు చురుగ్గా సాగుతోందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. 35 గ్రామ పంచాయతీల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ యజమాని బయోమెట్రిక్‌ను తీసుకుంటున్నారు. వైఎస్సార్ బీమా ప్రయోజనాలను వలంటీర్లు వివరిస్తున్నారు. కుటుంబ యజమాని సహజ మరణం పొందితే ఈ పథకం ద్వారా ఆ కుటుంబానికి లక్ష రూపాయలు, ప్రమాదంలో మృతి చెందితే రూ. 5 లక్షల బీమాను ప్రభుత్వం అందిస్తుందని వలంటీర్లు వివరిస్తూ బీమా రెన్యువల్ చేస్తున్నారని ఎంపీడీఓ చెప్పారు .7వ తేదీలోగా శతశాతం బయోమెట్రిక్ పూర్తి చేయాలని వలంటీర్లను ఆదేశించినట్లు తెలిపారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి




చీపురుపల్లి: కొవ్వుత్తుల ర్యాలీ చేస్తున్న గోవిందరాజులు, తదితరులు

చీపురుపల్లి: ఒడిశాలోని బాలాసోర్ ప్రాంతంలో సంభవించిన రైలు ప్రమాదంలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా సాగింది. మానవీయతా స్వచ్ఛందసంస్థ అధ్యక్షుడు బి.వి. గోవిందరాజులతో పాటు పట్టణ వాసులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ ఎస్.కోట పట్టణవాసులు ఆదివారం నివాళి అర్పించారు. పట్టణవాసులు స్థానిక దేవీ జంక్షన్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు.

• కమ్మేసిన కారుమబ్బులు



విజయనగరం జిల్లా కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం కారుమబ్బులు కమ్మేశాయి. కొద్దిరోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజానీకం.. వాతావరణం ఒక్కసారిగా మారడంతో సేదదీరారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

కొత్తవలస: ఆత్మ రక్షణకు తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడతాయని సంఘమిత్ర స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ పాండ్రంగి రుకముఖరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎన్‌జీఓ హోం ప్రాంగణంలో 3వ ఏపీ తైక్వాండో పోటీలను ఆదివారం నిర్వహించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 280 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులు అధిక మెడల్స్ దక్కించుకోగా... శ్రీకాకుళం విద్యార్థులు రెండో స్థానం, విశాఖపట్నం జిల్లా వారు మూడు స్థానంలో నిలిచారు. తైక్వాండో స్టేట్ ఇన్‌చార్జి కె.కృష్ణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎం.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు నగదు, జ్ఞాపికలను అందజేస్తున్న డాక్టర్ తిరుపతి

జామి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని అలమండ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు విజయనగరం ఉదయ్ నర్సింగ్ హోమ్ డాక్టర్ గేదెల తిరుపతి నగదు ప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. ఆ పాఠశాలలకు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2 వేలు చొప్పున నగదుతో పాటు మెమొంటోలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన తండ్రి జ్ఞాపకార్థం నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని దాత డాక్టర్ తిరుపతి తెలిపారు.